# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి


రామాయంపేటలో బైక్ ర్యాలీలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**రామాయంపేట(మెదక్):** బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో ఆదివారం ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. మెదక్ నుంచి రామాయంపేటకు వచ్చిన ఎమ్మెల్యేకు పార్టీ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం మెదక్ బ్రిడ్జి నుంచి పార్టీ కార్యాలయం వరకు కార్యకర్తలతో ఎమ్మెల్యే స్కూటీ నడుపుతూ బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రామాయంపేట, కాట్రియాల, దంతేపల్లి, తదితర గ్రామాలకు చెందిన వారు పార్టీలో చేరారు.

**రామాయంపేట(మెదక్):** పట్టణంలోని యువ జ్యోతి ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని సన్మానించారు. క్రీడలను ఎమ్మెల్యే ఎంతో ప్రోత్సహిస్తున్నారని అసోసియేషన్ అధ్యక్షుడు సత్యం పేర్కొన్నారు.

## క్లుప్తంగా

### మత్స్యకార సంఘం నూతన కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

**నర్సాపూర్:** పట్టణ మత్స్యకార సంఘానికి కొత్త పాలక కమిటీని సంఘం సభ్యులు ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా నాగభూషణం, ఉపా ధ్యక్షుడిగా కొండికుమార్, కార్యదర్శిగా యాదగిరి, డైరెక్టర్లుగా నరసింలు, సంతోష్, ప్రవీణ్‌కుమార్, శ్రీకాంత్, రవిశంకర్, అశోక్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు, డైరెక్టర్లు మాట్లాడుతూ.. పట్టణంలోని మత్స్యకారుల సంక్షేమం కోసం పాటుపడుతామని చెప్పారు. కొత్త పాలక కమిటీని సభ్యులు శాలువాలతో సన్మానించారు.

### ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం


ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పాలకవర్గం

**రామాయంపేట(మెదక్):** నార్సింగి మండలంలోని సంకాపూర్ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణానికి రూ. 20 లక్షలతో పాటు అబివృద్ధి పనులకు ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారని పంచాయతీ పాలకవర్గం సభ్యులు, గ్రామస్తులు పేర్కొన్నారు.

### చెత్తను పూర్తిగా తొలగించండి

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి


దేవాలయ భూములను పరిశీలించి కమిషనర్‌కు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

**నర్సాపూర్:** పట్టణ శివారులోని దేవాలయ భూముల్లో చెత్తను పూర్తిగా తొలగించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్‌కు సూచించారు. ఆదివారం ఆయన నర్సాపూర్ మెదక్ జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న దేవాలయ భూములను పరిశీలించారు. గతంలో దేవాలయ భూముల్లో వేసిన చెత్తను పూర్తిగా ఎత్తి వేయాలని, డంపింగ్ యార్డును వినియోగంలోకి తేవాలని ఆయన సూచించారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, మన్సూర్, పంబాల భిక్షపతి, దావూద్, వెంకట్ రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# మత్స్యకారులకు అందుబాటులో ఉంటా


సంఘం డైరెక్టర్లను అభినందిస్తున్న సునీతారెడ్డి

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

**నర్సాపూర్:** మత్స్యకారులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. నర్సాపూర్ పట్టణ మత్స్యకారుల సంఘం ఎన్నికలు ఆదివారం జరుగగా నూతన పాలక కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. కాగా కొత్తగా ఎన్నికైనా మత్స్యకారుల సంఘం డైరెక్టర్‌లు సంతోష్, నర్సింలు, శ్రీకాంత్ తదితరులు మర్యాద పూర్వకంగా వెళ్లి సునీతారెడ్డిని కలువగా, ఆమె వారందరిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేయడంతో పాటు అందరికి అందుబాటులో ఉంటానని వారికి హామీ ఇచ్చారు. ఆమె వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు నయీం, సత్యంగౌడ్, షేక్ హుస్సేన్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు ఉన్నారు. పట్టణ మత్స్యకారుల సంఘం డైరెక్టర్లను మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అభినందించారు. ఎన్నికల్లో ఎంపికైన డైరెక్టర్లను మురళీయాదవ్ సన్మానించి అభినందించారు. అలాగే డైరెక్టర్లు కూడా మున్సిపల్ చైర్మన్‌ను సన్మానించారు.

# రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

జిల్లా వ్యాప్తంగా ఆదివారం దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు ఆయన విగ్రహాలకు నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయం అని, ఆయన్ను కొనియాడారు. అనంతరం నాయకులు ప్రభుత్వ ఆస్పత్రిలో, వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు


మనోహరాబాద్(తూప్రాన్): రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నర్సారెడ్డి


పెద్దశంకరంపేటలో ..


రామాయంపేట(మెదక్): నార్సింగిలో..

# మదన్‌రెడ్డికి టికెట్ ఇవ్వండి

లేదంటే మూకుమ్మడి రాజీనామాలు: బీఆర్ఎస్ నాయకులు


నినాదాలు చేస్తున్న నాయకులకు నచ్చ చెప్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

**నర్సాపూర్:** ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి టికెట్ ఇవ్వాలని పలువురు బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పలువురు పార్టీ నాయకులతో సమావేశమై ఈనెల 23న సీఎం కేసీఆర్ మెదక్‌కు వస్తున్నందున జన సమీకరణ విషయమై చర్చించారు. అనంతరం ఆయన హైదరాబాద్ వెళ్లేందుకు కార్యాలయం నుంచి బయటకు రాగానే అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకులు మదన్‌రెడ్డికే టికెట్ ఇవ్వాలని, లేకుంటే తాము మూకుమ్మడిగా పదవులకు రాజీనామా చేస్తామని నినాదాలు చేశారు. నినాదాలు చేసినప్పుడు క్యాంపు కార్యాలయం వద్ద జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, అశోక్‌గౌడ్, హబీబ్‌ఖాన్, భిక్షపతి, సుధీర్‌రెడ్డి, రమణగౌడ్, తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే కల్పించుకొని ఎవరు రాజీనామా చేయొద్దని నాయకులకు నచ్చచెప్పారు.

## ముమ్మరంగా సొసైటీ భవన నిర్మాణం పనులు

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండలంలోని మహ్మద్ నగర్ సొసైటీ సొంత భవనం నిర్మాణం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుతం సొసైటీ భవనం మహ్మద్‌నగర్ గ్రామంలో ఉండగా కార్యాలయం కౌడిపల్లిలో ఉంది. కాగా నూతనంగా మహ్మద్‌నగర్(ముంద్రాయి)గేట్ వద్ద జాతీయ రహదారి పక్కన రూ. 54 లక్షలతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఏనె స్థలాన్ని చదును చేసి 25 గుంటలు కేటాయించారు. సొసైటీ పరిధిలో 27 గ్రామ పంచాయతీలు, 13 డైరెక్టర్లు ఉన్నారు.

## కారు ఢీకొని పశువుల కాపరి మృతి

**చేగుంట(తూప్రాన్):** కారు బోల్తాపడి పశువుల కాపరి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన చేగుంట శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అనంతసాగర్ గ్రామానికి చెందిన కొటారి పర్షయ్య(53) చేగుంట శివారులోని జాతీయ రహదారిపక్కన పశువులను మేపుతున్నాడు. ఈక్రమంలో కామారెడ్డి నుంచి ఆరుగురు ప్రయాణికులతో హైదరాబాద్ తిరుమలగిరికి వస్తున్న ఇన్నోవా కారు అదుపుతప్పి రోడ్డుకిందికి దూసుకుపోతూ పర్షయ్యను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందగా, కారులో ప్రయాణిస్తున్న ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వారందరినీ 108లో తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రిలో తరలించారు. కేసు నమోదు చేసుకొని పర్షయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్ఐ రవీందర్ తెలిపారు.

## మాజీ ఎమ్మెల్యే హర్షం

**పాపన్నపేట(మెదక్):** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ శాశ్వత సభ్యుడిగా దామోదర రాజా నర్సింహ నియామకంపై మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి హర్షం ప్రకటించారు.

## సమస్యలు పరిష్కరించాలి

**నర్సాపూర్:** ఈనెల 23న సీఎం కేసీఆర్ మెదక్‌కు వస్తున్నందున నర్సాపూర్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి నాగరాజు కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నర్సాపూర్‌లో పీజీ కాలేజీకి భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలన్నారు.

# సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న పూర్వవిద్యార్థులు

**కౌడిపల్లి(నర్సాపూర్):** పాఠశాలలో చదువుకున్న పూర్వవిద్యార్థులు పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటుతో పాటు సంస్కృతిక కార్యక్రమాలకు స్టేజీ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. మండల కేంద్రం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో 1994 – 95బ్యాచ్ పూర్వవిద్యార్థులు సరస్వతి విగ్రహం ఏర్పాటుకు ముందుకు రావడంతో ఆదివారం ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, డాక్టర్ పురుషోత్తం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ జగన్, పూర్వ విద్యార్థులు కుత్‌బొద్దీన్, నర్సింలు, మహ్మద్, లక్ష్మయ్య, రాజు, భుజిరంపేట మాజీ సర్పంచ్ లక్ష్మణ్, లైన్‌మెన్ శివకుమార్, వడ్ల కిష్టం తదితరులు పాల్గొన్నారు.


సంఘం ఆవరణలో క్యూలో నిల్చున్న రైతులు

# యూరియా కోసం బారులు

**కొల్చారం(నర్సాపూర్):** యూరియాకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ఆదివారం మండలంలోని రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి 450 బస్తాల లోడ్‌తో లారీలో యూరియా వచ్చింది. సమాచారం తెలుసుకున్న గ్రామానికి చెందిన రైతులతో పాటు పరిసర గ్రామాల రైతులకు పెద్ద ఎత్తున తరలిరావడంతో సంఘం ఆవరణ మొత్తం రైతులతో నిండిపోయింది. దీంతో రైతులు యూరియా కోసం ఎగబడటంతో గందరగోల వాతావరణం నెలకొంది.

# సీఎం కేసీఆర్ సభను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

**మనోహరాబాద్(తూప్రాన్):** సీఎం కేసీఆర్ ఈ నెల 23న మెదక్‌లో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వస్తున్న సందర్భంగా ప్రతీ ఒక్కరు సభను జయప్రదం చేయాలని రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు కొట్టాల యాదగిరి, ర్యాకల శేఖర్‌గౌడ్ కోరారు. ఆదివారం మండలంలోని కాళ్ళకల్, కోనాయపల్లి(పీటీ), వెంకటాపూర్ అగ్రహారం గ్రామాల్లో కార్యకర్తల సమన్వయ సమావేశాన్ని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ బహిరంగ సభలో పాల్గొన్నాలని కార్యకర్తలకు, నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు మల్లేశ్, ప్రభావతి, రేణుకా, నాయకులు ,ఉప సర్పంచ్ రాజుయాదవ్, వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

**టేక్మాల్(మెదక్):** అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో ఆదివారం సీఎం సభ సన్నాహక సమావేశాలను నిర్వహించినట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

**చిన్నశంకరంపేట(మెదక్):** మండలంలోని మిర్జాపల్లి, కామారం తండా, టీ.మాందాపూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ సోమిరెడ్డి, సారయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు, లక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# అధ్వానంగా రోడ్డు


రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలుపుతున్న సభ్యులు

**అల్లాదుర్గం(మెదక్):** అల్లాదుర్గం ఐబీ చౌరస్తా నుంచి బహిరన్‌దిబ్బ గ్రామం,చేవెళ్ల శివారు వరకు రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగునా మోకాలు లోతు గుంతలు ఏర్పడ్డాయి. వర్షానికి గుంతల్లో నీళ్లు నిల్చాయి. దీంతో ఆదివారం ఆ నీటిలో మండల అసెంబ్లీ నియోజకవర్గ సాధన సమితి సభ్యులు వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు బ్రహ్మం మాట్లాడుతూ.. రోడ్డు అధ్వానంగా మారి ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నా.. ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ సొంత గ్రామం పోతులబోగూడకు నిత్యం ఇదే రోడ్డుపై వెళ్తున్నా.. పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, రాములు, శ్రీను, చిన్న, మంజునాథ్ పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు


కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు


చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ ఆలయంలో భక్తుల పూజలు

**కౌడిపల్లి(నర్సాపూర్):** మండలంలోని తునికి నల్ల పోచమ్మదేవి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి ఉదయం పంచామృతాభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి, ఒడి బియ్యం పోశారు. దీంతో పాటు పలువురు వాహనాలకు సైతం పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ సిబ్బంది వెంకట్ రెడ్డి, సర్పంచ్ సాయిలు, ఉసర్పంచ్ మానిక్యరెడ్డి, మాజీ సర్పంచ్ సాయాగౌడ్, ధర్మకర్తలు తదితరులు ఏర్పాట్లు చేశారు.

**చిలప్‌చెడ్(నర్సాపూర్):** మండల పరిధిలోని చిటుకుల్ శివారులోని మంజీరా తీరంలో వెలసిన చాముండేశ్వరీ అమ్మవారిని ఆదివారం భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు అమ్మవారికి కుంకుమార్చనలు చేసి భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

**శివ్వంపేట(నర్సాపూర్):** మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శ్రావణ మాస సందడి నెలకొంది. శ్రావణమాసం మొదటి ఆదివారం సందర్భంగా లక్ష్మీనర్సింహస్వామికి ఆలయ అర్చకులు అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులులక్ష్మీనర్సింహస్వామి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

**మనోహరాబాద్(తూప్రాన్):** మండలంలోని ముప్పిరెడ్డిపల్లిలో బోడ్రాయికి గ్రామస్తులు ఆదివారం అర్చకుడు వేణుగోపాల్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ ప్రభావతి, ఉప సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ **అల్లాదుర్గం ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా రాములు**



**అల్లాదుర్గం(మెదక్):** అల్లాదుర్గం నూతన ముదిరాజ్ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మురాడి రాములు, ఉపాధ్యక్షుడిగా కోన్యాల బుచ్చయ్య, ప్రధాన కార్యదర్శిగా బోయిని బేతయ్య, గౌరవ అధ్యక్షులుగా లక్ష్మయ్య, నారాయణ, కోన్యాల సాయిలు, బేతయ్య, కార్యవర్గ సభ్యులుగా పెంటయ్య, బాగయ్య, వెంకటేశం , యాదయ్య, డాకయ్య తదితరులు ఎన్నికయ్యారు.

**గ్రామాల్లో స్వచ్ఛతే లక్ష్యం**



**మనోహరాబాద్(తూప్రాన్):** మండలంలోని కూచారం గ్రామంలో నేచర్ ఐకాన్ యువత 279వ వారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఆదివారం గ్రామంలోని హరితవనంలో, పలు వీధుల్లో గడ్డి, చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. ప్లాస్టిక్, చెత్త చెదారాన్ని తీసేసి, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

◆ **చికిత్స పొందుతూ యువకుడు మృతి**

**మెదక్:** అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన ఓ యువకుడు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నశంకరంపేట మండలం జంగారాయి గ్రామానికి చెందిన మహేశ్(25) అనారోగ్యంతో మెదక్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఈనెల 19న మధ్యాహ్నం చేరారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందినట్లు మృతుడి కుటుంబీకులు తెలిపారు.

◆ **కాంగ్రెస్ మైనార్టీసెల్ మండలాధ్యక్షుడిగా అక్బర్**

**చిన్నశంకరంపేట(మెదక్):** కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడిగా ఖాజాపూర్ గ్రామానికి చెందిన అక్బర్‌ను నియమిస్తూ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ మజార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా అక్బర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

◆ **క్రాంతికిరణ్‌ను విమర్శించడం సరికాదు**

**టేక్మాల్(మెదక్):** బీఆర్ఎస్ పార్టీలోనే ఉండి పదవులు అనుభవిస్తూ కొందరు అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌ను విమర్శించడం సరికాదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు అక్బర్‌పాషా ఆరోపించారు. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్యేతో అన్ని పనులు చేయించుకొని ప్రస్తుతం అసమ్మతిగా తయారై లేనిపోని ఆరోపణలు చేయడం పద్ధతి కాదన్నారు. గ్రామాల్లో క్రాంతికిరణ్ కృషితో ఎంతో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేస్తే సహించబోమన్నారు. అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధామా అంటూ సవాల్ విసిరారు. పార్టీలోనే ఉండి వెన్నుపోటు రాజకీయాలు చేయడం సరికాదన్నారు.

◆ **జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి**

**అల్లాదుర్గం(మెదక్):** అందోల్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం జోగిపేట ప్రాంతంలోనే మండల స్థాయి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలో చిల్వేర గ్రామంలో టేక్మాల్, అల్లాదుర్గం జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జర్నలిస్టు కోటాలో అందోల్ ఎమ్మెల్యేగా గెలుపందిన క్రాంతి కిరణ్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాల గురించి పట్టించుకోవడం లేదన్నారు. వారం రోజుల్లో స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు భూమయ్య, అనంద్, రాజు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

**నీటికుంటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్**


కుంటలో పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

**శివ్వంపేట(నర్సాపూర్):** కుంట కట్టకు ఆనుకొని ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోయింది. మండల పరిధిలోని గుండ్లపల్లి పంచాయతీ పరిధిలోని పబ్బన్నకుంటలో కట్టకు ఆనుకొని పలు వ్యవసాయ బోరుబావులకు కరెంట్ కోసం 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. కురిసిన వర్షాలకు కుంటలో నీరు చేరి ట్రాన్స్‌ఫార్మర్ గద్దె కూలిపోయింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ నీటిలో పడిపోయింది. దీంతో సంబంధిత వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని రైతులు కుమార్, రాములు, పాషా అన్నారు. కుంటనీటిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీసి అనువైన ప్రదేశంలో ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయం ట్రాన్స్‌కో ఏఈ దుర్గప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా.. కుంటలో కూలిన ట్రాన్స్‌ఫార్మర్ వెలికితీసి మరోచోట ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు.

◆ **చేరికలు**

**నిజాంపేట(మెదక్):** మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ నర్సింలుతో పాటు 20 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి తిరుపతిరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లింగంగౌడ్, పట్టణాధ్యక్షుడు నసీరొద్దీన్, జిల్లా కార్యదర్శి మహేందర్, మధుసుదన్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మోహన్‌రెడ్డి, జిట్టి మారుతి, ఆకుల నాగరాజు, ఆకుల బాలయ్య, దేవదాసు తదితరులున్నారు.

◆ **రంగంపేట ఎస్‌బీఐలో పంట రుణాల మాఫీ**

**కొల్చారం(నర్సాపూర్):** మండలంలోని రంగంపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ పరిధిలో సోమవారం నుంచి గ్రామాల వారీగా పంట రుణాల మాఫీ, రెన్యువల్, పంటరుణ పునరుద్ధరణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ చౌరి ప్రసాద్ ఆదివారం తెలిపారు.